ఆదివారం

28-7-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 407 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## మోడీని పెద్దన్న అని పిలుస్తే తప్పేముంది

- కేంద్రం నుంచి నిధులు రాబట్టాల్సిందే
- పాతబస్తీకి మెట్రో రైలు నిర్మాణం చేపడుతాం
- శాసనసభలో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు

ముందడుగు హైదరాబాద్:

దేశ ప్రధాని మోడీని పెద్దన్న అని సంభోదించటంలో తప్పేముంది. రాష్ట్రానికి నిధులు సాధించటం కోసమే పెద్దన్న అని సంబోధించానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రెండో దశ మెట్రో నిర్మాణానికి నిధులు కోరితే కేంద్రం రూపాయి కూడా ఇవ్వలేదని అన్నారు. శాసనసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఎంఐఎం శాసనసభాపక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ పాతబస్తీకి మెట్రో రైలు అంశాన్ని లేవనెత్తారు. ఎప్పటిలోగా మెట్రో రైలు నిర్మాణం చేపడతారో చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. "ఈ ప్రభుత్వం ఎల్బీనగర్ నుంచి ఎయిర్‌పోర్టుకు మెట్రో నిర్మించనుంది. పాతబస్తీ ప్రజలకు మేలు కలిగేలా చాంద్రాయణగుట్ట మీదుగా మెట్రో రైలు నిర్మాణం చేపడతాం. 78 కి.మీ మెట్రో ప్రాజెక్టు కోసం కేంద్రానికి నివేదిక ఇచ్చాం. పాతబస్తీ, ఎయిర్‌పోర్టుకు మెట్రోను కచ్చితంగా నిర్మించి తీరుతాం. రెండో దశకు ఇప్పటికే భూ సేకరణ మొదలుపెట్టాం.



తెలంగాణకు నిధుల విషయంలో కేంద్రం వివక్ష చూపుతోంది. నిధులన్నీ యూపీ, బిహార్, గుజరాత్‌కే కేటాయిస్తున్నారు. అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని బహిరంగసభ వేదికగా మోదీకి చెప్పాను. రాష్ట్రాల పట్ల పెద్దన్నలాగా వ్యవహరించాలని కోరా. ఫెడరల్ సిస్టంలో కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టుకోవాల్సిందే. చేయాల్సిన ప్రయత్నాలు పూర్తిగా చేయాల్సిందే. వాళ్లు ఇవ్వనంత మాత్రాన రాష్ట్రాభివృద్ధి ఆగదు. చాలా ఫైనాన్షియల్ సంస్థలు తక్కువ వడ్డీకే రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. 2029 ఎన్నికల నాటికి పాతబస్తీకి మెట్రోరైలు నిర్మించి అదే మెట్రో రైల్‌లో అక్బరుద్దీన్ ఒవైసీతో కలిసి ఓల్డ్ సిటీకి వెళ్తా" అని సీఎం అన్నారు. పాతబస్తీని ఇస్తాంబుల్ చేస్తామని, వరంగల్‌ను లండన్‌గా మారుస్తామని, కరీంనగర్‌ను న్యూయార్క్ చేస్తామని అబద్ధాలు చెప్పి మోసం చేయబోమని వ్యాఖ్యానించారు.




## వచ్చే 25 ఏళ్లలో వికసిత్ భారత్

- రాష్ట్రాల సహకారం చాలా ముఖ్యం
- మోడీ రాష్ట్రాలకు పలు కీలక సూచనలు

ముందడుగు జాతీయం:

వచ్చే 25 ఏళ్లలో వికసిత్ భారత్ సాధించే దిశగా ప్రధాని మోదీ కీలక సూచనలు చేశారు. మమతా బెనర్జీకి మాట్లాడే అవకాశం ఇవ్వలేదనటం వాస్తవం కాదు. ప్రతి సీఎంకు మాట్లాడేందుకు 7 నిమిషాల సమయం ఇచ్చాం. ప్రధానంగా రెండు అంశాలపై చర్చ జరిగింది. 2047 నాటికి వికసిత్ భారత్ సాకారం అయ్యే ప్రణాళికపై చర్చించాం. దేశంలో ప్రతి ఇంటికీ తాగునీరు, విద్యుత్ వంటి సదుపాయాల కల్పనపై చర్చించాం. వికసిత్ భారత్‌పై కేంద్రం రూపొందించిన డాక్యుమెంట్‌ను వివరించాం. వికసిత్ భారత్ సాధించడంలో రాష్ట్రాల సహకారం చాలా ముఖ్యం. రాష్ట్రాలు అమలు చేయాల్సిన ప్రణాళికలపై సూచనలు చేశాం. వైద్యరంగంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై విస్తృతంగా చర్చించాం. సైబర్ సెక్యూరిటీలో అమలు చేయాల్సిన సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించాం. అభివృద్ధి విషయంలో రాష్ట్రాల ప్రణాళికలు కూడా నీతి ఆయోగ్ శ్రద్ధగా విన్నది. కొన్ని రాష్ట్రాల సూచనలు, వారి ప్రణాళికలు చాలా బాగున్నాయి. తెలంగాణ, తమిళనాడు, కేరళ సహా పది రాష్ట్రాల నుంచి నీతి ఆయోగ్ సమావేశానికి ఎవరూ పాల్గొనలేదు" అని సీఈవో మిగతా 2లో



## గోదావరిలో పెరుగుతున్న వరద

మిగతా 2లో





## ఒలింపిక్ క్రీడా పోటీల్లో బీహార్ ఎమ్మెల్యే

మిగతా 3లో



## ఓ స్త్రీ తన జీవితకాలంలో ఎంత మందికి జన్మనివ్వగలదు

మిగతా 4లో

## తెలంగాణలో లా అండ్ ఆర్డర్ పనిచేస్తుందా..

- రేవంత్ పాలనలో 500 హత్యలు, 1800 రేప్‌లు
- ఒక్క నెలలోనే హైదరాబాద్ నగరంలో 28 మర్డర్లు
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడిన హరీశ్ రావు



02

## యువతలో హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ అధికం

పెరుగుతున్న తల, మెడ భాగాల్లో వచ్చే క్యాన్సర్ కేసులు

వివరాలు 2లో



## సప్త సాగరాలు బ్యూటీతో రొమాన్స్ చేయనున్న విజయ్ దేవరకొండ.?

మిగతా 5లో

ముందడుగు
ఆదివారం, 28-7-2024, హైదరాబాద్

## వచ్చే 25 ఏళ్లలో
# వికసిత్ భారత్

(మొదటిపేజీ తరువాయి)
వివరించారు. పలు రాష్ట్రాల సీఎంలు, కేంద్ర పాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, కేంద్ర మంత్రులతో పాటు నీతి ఆయోగ్ వైస్ చైర్మన్, సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశంలో పాల్గొన్నారు.

నీతి ఆయోగ్ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్రాలకు పలు కీలక సూచనలు చేశారని సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్రపతి భవన్‌లోని కల్చరల్ సెంటర్‌లో శనివారం నీతి ఆయోగ్ సమావేశం జరిగింది. తొమ్మిదవ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశానికి ప్రధాని మోడీ అధ్యక్షత వహించారు. సమావేశం అనంతరం వివరాలను నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం మీడియాకు వెల్లడించారు.

## తెలంగాణలో లా అండ్ ఆర్డర్
# పనిచేస్తుందా..




ముందడుగు తెలంగాణ:
తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. రేవంత్ పాలనలో ఈ 8 నెలల కాలంలో హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని మండిపడ్డారు. శాసనసభలో బడ్జెట్‌పై సాధారణ చర్చ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 8 నెలల్లో హత్యలు 500, డకాయిటీస్ 60, దోపిడీలు 400, దొంగతనం కేసులు 10 వేలు, రేప్ కేసులు 1800 నమోదైనట్లు హరీశ్‌రావు తెలిపారు. పోయిన ఒక్క నెలలోనే హైదరాబాద్ నగరంలో 28 మర్డర్లు జరిగాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. రేవంత్ రెడ్డి తన వద్దే హోం శాఖ పెట్టుకుని ఏం చేస్తున్నారని హరీశ్‌రావు నిలదీశారు.

దేశంలోనే ఎక్కడ లేని విధంగా 10 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి శాంతి భద్రతల నిర్వహణ సమర్థవంతంగా చేశామని హరీశ్‌రావు గుర్తు చేశారు. గంగా జమునా తెహజీబ్‌ను మత సామరస్యాన్ని కాపాడినం. కరువులు, కర్ఫ్యూలు లేని పరిపాలన అందించినం. మీరు ఉద్యోగాలకోసం చాలా సౌకర్యంగా కూర్చుంటున్న పోలీస్ కమాండ్ కంట్రోల్ భవనం, సచివాలయ భవనం కూడా మా హయాంలోనే నిర్మించామన్న సంగతి మరిచిపోకండి. మీరు వద్దన్నా ఆ భవనాలు మీకు గుర్తుచేస్తాయి. ముఖ్యమంత్రి గురువు సాలీ సహచరుడైన చంద్రబాబు నాయుడు కూడా ఈ మధ్యనే హైదరాబాద్‌లో జరిగిన సభలో కేసీఆర్ హయాంలో హైదరాబాద్ చాలా అభివృద్ధి జరిగింది అని ప్రకటించారు. ప్రత్యర్థులు కూడా ప్రశంసించేలా మేము హైదరాబాద్‌ను అన్ని కోణాలలో అభివృద్ధి చేశాం. కుట్ర పూరితంగా మీరు కాదన్న మాత్రాన కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధి అదృశ్యమై పోదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# యువతలో హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ అధికం
## పెరుగుతున్న తల, మెడ భాగాల్లో వచ్చే క్యాన్సర్ కేసులు

ముందడుగు జాతీయం:
దేశంలో క్యాన్సర్ కేసులు భారీగా పెరుగుతున్నాయి. అందులో తల, మెడ భాగాల్లో వచ్చే క్యాన్సర్ కేసుల సంఖ్య బాగా పెరుగుతోందని తాజా అధ్యయనంలో వెల్లడైంది. దేశంలోని మొత్తం క్యాన్సర్ కేసులలో తల, మెడ భాగాలకు సంబంధించిన క్యాన్సర్ కేసులే 26 శాతం ఉన్నాయని ఈ అధ్యయనం గుర్తించింది. దాదాపు 1,869 మంది క్యాన్సర్ రోగుల మీద చేసిన ఈ పరిశోధన ఫలితాలను 'వరల్డ్ హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ డే' సందర్భంగా శనివారం వెల్లడించారు.

ఢిల్లీకి చెందిన 'క్యాన్సర్ ముక్త్ భారత్ ఫౌండేషన్' ఈ అధ్యయనం నిర్వహించింది. ఈ ఏడాది మార్చి 1 నుంచి జూన్ 30 వరకు ఫౌండేషన్ హెల్ప్‌లైన్‌కు వచ్చిన ఫోన్ కాల్స్ డాటాను విశ్లేషించి ఈ అధ్యయనం నిర్వహించారు. ఈ అధ్యయనంపై



క్యాన్సర్ ముక్త్ భారత్ క్యాంపెయిన్‌కు నేతృత్వం వహిస్తున్న ప్రముఖ ఆంకాలజిస్ట్ ఆశీశ్ గుప్తా మాట్లాడుతూ.. గత కొన్నాళ్లుగా హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా యువతలో ఈ హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని చెప్పారు. పొగాకు వినియోగం, పాపిలోమా వైరస్ ఇన్ఫెక్షనే ఇందుకు కారణమని అన్నారు. సుమారు 80 నుంచి 90 శాతం ఓరల్ క్యాన్సర్ కేసులు ఏదో ఒక రూపంలో పొగాకును తీసుకోవడం వల్లనే సంభవిస్తున్నాయని ఆయన చెప్పారు. మిగతా క్యాన్సర్‌లతో పోల్చితే హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ నివారించదగినదని, అలవాట్లను మార్చుకుంటే అదుపులో పెట్టుకోవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

# గోదావరిలో పెరుగుతున్న వరద
## ధవళేశ్వరం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక జారీ

ముందడుగు ఆంధ్రప్రదేశ్:
ఎగువ ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో వరదనీరు రాజమహేంద్రవరం వైపుగా ప్రవహిస్తోంది. గోదావరిలో వరద మళ్లీ క్రమంగా పెరుగుతోంది. నిన్నంతా హెచ్చుతగ్గులతో కొనసాగిన ప్రవాహం.. శనివారం ఉదయం నుంచి పెరుగుతోంది. ప్రస్తుతం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 13.75 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండటంతో అధికారులు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. సముద్రంలోకి 13లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాలువలు, కల్వర్టులకు ప్రజలు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు. భద్రాచలం వద్ద గంట గంటకు వరద ప్రవాహం పెరగటం ఆందోళన కలిగిస్తోంది. కోనసీమలోని గౌతమి, వశిష్ట, వైనతేయ నదీ పాయలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. కోనసీమలోని లంక గ్రామాలను వరదనీరు చుట్టు ముట్టేస్తుండటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి సముద్రంలోకి వరదనీరు వదులు తుండడంతో కాకినాడ



జిల్లాలో అంతర్భాగంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాంలో ప్రవహించే గౌతమీ గోదావరి బాలయోగి వారధి వద్ద ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. రాజీవ్ బీచ్ పరివాహక ప్రాంతంలో ఉండే పుదుచ్చేరి పర్యాటక శాఖకు చెందిన వాటర్ స్పోర్ట్స్ నీట మునిగింది. మత్స్యకారులు తమ మెకనైజ్డ్ బోట్లు, నావలు, వలలు కొట్టుకుపోకుండా టైడల్ లాక్ వద్దకు చేర్చి తాళ్లతో బంధించారు.

ముందడుగు
ఆదివారం, 28-7-2024, హైదరాబాద్

# ఒలింపిక్ క్రీడా పోటీల్లో బీహార్ ఎమ్మెల్యే

## ఎమ్మెల్యే కాకముందు షూటింగ్ క్రీడాకారిణి






ముందడుగు బీహార్:
ఒలింపిక్ క్రీడాపోటీలు పారిస్ వేదికగా అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. ఒలింపిక్ బరిలో మన దేశం నుంచి 117మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. అందులో బిహార్ ఎమ్మెల్యే కూడా ఉన్నారు. బిహార్‌లోని జముయ్ శాసనసభ్యురాలిగా ఎంపిక కాకముందే శ్రేయసి సింగ్ షూటింగ్ క్రీడాకారిణి. అలాగే అర్జున అవార్డు గ్రహీత కూడా. డబుల్ ట్రాప్ విభాగంలో 2024లో గ్లాస్గోలో కామన్‌వెల్త్ గేమ్స్‌లో రజత పతాకాన్ని 2018లో గోల్డ్‌కోస్ట్ జరిగిన పోటీల్లో బంగారు పతాకాన్ని సాధించారు. శ్రేయసి గిదౌర్ లో పుట్టి పెరిగారు. ఫరిదాబాద్‌లోని మానవ్‌రచనా యూనివర్సిటీలో ఎంబిఏ పూర్తి చేశారు. 2020లో జరిగిన బిహార్ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేపై 41 వేల ఓట్ల మెజారిటీతో గెలిచారు. శ్రేయసి బీహార్ మాజీ ఎంపీ దిగ్విజయ్ సింగ్ కుమార్తె. తల్లి పుతుల్ సింగ్ బంకా నియోజకవర్గ ఎంపీ. తల్లిదండ్రులిద్దరూ రాజకీయాల్లో రాణించడంతో తనూ ఆ దిశగా అడుగులు వేశారు. తాత, తండ్రి ఇద్దరు నేషనల్ రైఫిల్ అసోసియేషన్ కి అధ్యక్షులుగా వ్యవహరించారు. ఆ ప్రేరణతోనే షూటింగ్‌లో కెరియర్ నిర్మించుకోవాలనుకున్నారు.

# లోన్ యాప్ ద్వారా రూ.20 కోట్ల ఆర్థిక నేరం

## కేరళకు చెందిన మహిళ టెకీ అరెస్ట్






ముందడుగు కేరళ:
పర్సనల్ లోన్ యాప్ ద్వారా కేరళకు చెందిన మహిళా టెకీ దన్య మోహన్ సుమారు 20 కోట్ల మేర ఆర్థిక నేరానికి పాల్పడింది. మణప్పురం కంపెనీకి చెందిన పర్సనల్ లోన్ యాప్ ద్వారా ఆమె డబ్బును కాజేసింది. ఓ ఫేక్ లోన్ అకౌంట్ క్రియేట్ చేసిన ఆ మహిళ.. ఆ అకౌంట్‌కు డబ్బును ట్రాన్స్‌ఫర్ చేసి.. ఆ తర్వాత తన స్వంత బ్యాంక్ అకౌంట్లకు బదిలీ చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మణప్పురం కాంప్‌టెక్ కంపెనీలో మేనేజర్‌గా ఆమె కెరీర్ ప్రారంభించింది. ఆ తర్వాత ఆ కంపెనీలోనే అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా ప్రమోట్ అయ్యింది. దీని ద్వారా ఆ కంపెనీకి చెందిన పూర్తి డేటాను ఆమె యాక్సిస్ చేసుకున్నది. ఇక లోన్ యాప్ ద్వారా ఇన్‌స్టాంట్ లోన్ పద్ధతిలో డబ్బును కాజేసింది.

మహిళా టెకీ దన్య మోహన్ తన వద్ద ఉన్న డబ్బును తన భర్తకు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఆమె ఒంటరిగానే నేరానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఇదేమీ వ్యవస్థీకృత నేరం కాదు అని పోలీసులు భావిస్తున్నారు. భర్తకు సుమారు 40 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఆధారాలు ఉన్నాయని, దీన్ని పరిశీలించానని ఓ విచారణాధికారి తెలిపారు.

# మైనర్ బాలుడిపై 55 ఏళ్ల వ్యక్తి రేప్

## నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష




ముందడుగు ఒడిశా:
టీనేజ్ బాయ్‌ని రేప్ చేసిన కేసులో ఒడిశాలోని కేంద్రపారా జిల్లాకు చెందిన 55 ఏళ్ల వ్యక్తికి 20 ఏళ్ల జైలుశిక్ష పడింది. . ప్రత్యేక పోక్సో కోర్టు ఆ వ్యక్తికి 50వేల జరిమానా విధించింది. ఒకవేళ నిందితుడు ఆ డబ్బు చెల్లించకుంటే, అతనికి మరో రెండేళ్ల జైలుశిక్ష అమలు చేస్తారు. 2021లో టీనేజ్ బాలుడిని నిందితుడు రేప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గోవుల షెడ్‌కు తీసుకెళ్లి తన కుమారుడిని రేప్ చేసినట్లు తల్లి పోలీసు ఫిర్యాదులో పేర్కొన్నది. 14 ఏళ్ల బాలుడికి అయిదు లక్షలు చెల్లించాలంటూ కూడా ఒడిశా స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీకి కోర్టు ఆదేశాలు ఇచ్చినట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మనోజ్ కుమార్ సాహూ తెలిపారు. నిందితుడిపై ఐపీసీ 377, 6 సెక్షన్లతో పాటు పోక్సో చట్టం కింద కేసు బుక్ చేశారు. పది మంది సాక్ష్యులను విచారించారు.

# స్టంట్ చేస్తూ, కాలు చేయి పోగొట్టుకున్నాడు

## యువకుడి ఫోటో పోస్టు చేసిన రైల్వే శాఖ





ముందడుగు జాతీయం:
సోషల్ మీడియాలో ఫేమస్ కోసం చాలా మంది యువతీ, యువకులు వింత, వింత ప్రదర్శనలు చేస్తుంటారు. అలాంటిది కదులుతున్న రైలును మస్జిత్ షా యువకుడు రెండు చేతులతో పట్టుకొని స్టంట్లు చేస్తూ కనిపించాడు. అలా చేస్తుండగా జరిగిన ప్రమాదంలో ఒక కాలు, చేయి కోల్పోయాడని తెలుపుతూ యువకుడికి సంబంధించిన క్లిప్‌ను రైల్వే పోస్ట్ చేయడంతో వైరల్‌గా మారింది. ఇటీవల యువకుడి స్టంట్స్ వీడియో వైరల్‌గా మారడంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారని, అదుపులోకి తీసుకోవడానికి వెళ్లగా ఒక కాలు, చేయి కోల్పోయిన స్థితిలో కనిపించాడని అధికారులు తెలిపారు. ఏప్రిల్ 14న రైల్వే స్టేషన్‌లో రీల్స్ చేస్తుండగా జరిగిన ప్రమాదంలో ఒక చేయి, కాలు కోల్పోయానని తెలిపాడు.

యువత ప్రమాదకర స్టంట్లు చేయకుండా నివారించేందుకు మస్జిత్ షా ఘటన ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వప్నిల్ పేర్కొన్నారు. రైళ్లు, రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌లపై ఎవరైనా ఇటువంటి స్టంట్లు చేస్తే వెంటనే 9004410735 లేదా 139 నంబర్‌కు సంప్రదించాలని కోరారు. పోస్ట్ వైరల్‌గా మారడంతో నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. 'రీల్స్ మాయలో ఎంతో మంది యువత ఇలా ప్రమాదాల బారిన పడుతున్నా..మిగిలిన వారు తమ వైఖరిని మార్చుకోవట్లేదు' అంటూ ఓ నెటిజన్ స్పందించారు. మరొకరు స్పందిస్తూ 'ఇటువంటి వారిని కఠినంగా శిక్షించాలి..జైలు శిక్ష విధించాలి' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.



# అశ్లీల చిత్రాలపై బానిసై చెల్లిపై రేప్, హత్య

- 13 ఏళ్ల బాలుడు చేసిన అమానుష ఘటన

ముందడుగు మధ్యప్రదేశ్:
అశ్లీల వీడియోలు చూసిన 13 ఏళ్ల బాలుడు.. తన సొంత చెల్లినే రేప్ చేశాడు. ఈ విషయాన్ని తండ్రికి చెప్తానని 9 ఏళ్ల చెల్లి బెదిరించడంతో భయపడిన ఆ బాలుడు.. ఆమెను గొంతు నొక్కి హతమార్చాడు. అయితే ఈ విషయం కాస్తా ఆ బాలుడి తల్లి, ఇద్దరు అక్కలకు తెలిసింది. వారు ఆ ఘటనను కప్పిపుచ్చేందుకు ప్రయత్నించడం పెను సంచలనంగా మారింది. ఆ బాలిక మృతదేహాన్ని ఇంటి బయట పడేసిన కుటుంబ సభ్యులు.. చనిపోయిందంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు.. ఈ కేసును ఛేదించి చివరికి వాళ్లే నిందితులు అని తేల్చారు. ఈ ఘటన 3 నెలల క్రితం జర్గగా.. తాజాగా నిందితులను గుర్తించారు. మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లాలో జరిగిన ఈ సంఘటన సభ్య సమాజం తల దించుకునేలా ఉంది.

ముందడుగు
ఆదివారం,
28-7-2024,
హైదరాబాద్

# అమ్మవారి, పోతరాజు వేషధారణల్లో విద్యార్థులు



ముందడుగు హైదరాబాద్:
హైదరాబాద్ నగరంలోని కార్వాన్ శ్లోకా ది స్కూల్, గుడిమల్కాపూర్ బ్రాంచ్ లో బోనాల వేడుకలు నిర్వహించారు. ముందస్తు జరిగిన బోనాల ఉత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు వివిధ రకాల అమ్మవారి మరియు పోతరాజు వేషధారణాల్లో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశలోనే పిల్లలకి చదవుతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలు తెలియజేయాలనీ వారికి మన హిందూ సంస్కృతి గొప్పదనం బోదించాలని విద్యార్థులను ఉద్దేశించి ప్రశాంగించారు, ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

# బోనాలు స్పెషల్.. రవితేజ 'మిస్టర్ బచ్చన్' టీజర్ అప్‌డేట్




మాస్ మహరాజా రవితేజ, దర్శకుడు హరీశ్ శంకర్ కాంబోలో వస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునా హోగా' అనేది ఈ సినిమా ట్యాగ్‌లైన్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి షో రీల్‌తో పాటు పాటలు విడుదల చేయగా ఫుల్ రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ సినిమాను ఇండిపెండెన్స్ కానుకగా ఆగష్టు 15న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదలకు ఇంకా 18 రోజులే ఉండడంతో ప్రమోషన్స్ వేగం పెంచింది. ఇందులో భాగంగా ఈ మూవీ నుంచి టీజర్ అప్‌డేట్‌ను ప్రకటించింది చిత్రయూనిట్. ఈ మూవీ టీజర్‌ను బోనాల పండుగ కానుకగా రేపు విడుదల చేయనున్నట్లు తెలిపింది. మిరపకాయ్ సినిమా తర్వాత రవితేజ, హరీశ్ శంకర్ కాంబోలో ఈ సినిమా వస్తుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. రవితేజ ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్ అభిమానిగా కనిపించనున్నాడు. ఈ చిత్రంలో రవితేజ ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నాడు.



# ఓ స్త్రీ తన జీవితకాలంలో ఎంత మందికి జన్మనివ్వగలదు

- ఒక కాన్పులో ఎక్కువ మంది జన్మిస్తారు
- ఇప్పటివరకు ప్రపంచంలో ఉన్న రికార్డులు ఏంటి

ముందడుగు ప్రత్యేకం
పురాణాల్లో కొన్ని పాత్రలు వందల మంది బిడ్డలకు జన్మనిచ్చాయని తెలిసి ఆశ్చర్యపోతాం. అదెలా సాధ్యమని నోరెళ్లబెడతాం. కాని 18వ శతాబ్దంలో రష్యాలో వాసిలీవ్ అనే మహిళకు 69 మంది పిల్లలు పుట్టారు. అయితే ఒక స్త్రీ తన జీవితకాలంలో ఎంత మందికి జన్మనివ్వగలదు అనే ప్రశ్నకు సమాధానం జీవ, వైద్య, సామాజిక కోణాలను కలిగి ఉంటుంది. ఇవన్నీ కలిసి మానవ పునరుత్పత్తి సామర్థ్యాన్ని రూపొందిస్తాయి.

2024 జులై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారు. అధిక జనాభా సమస్యలు, సమాజం, పర్యావరణం, అభివృద్ధిపై చూపించే ప్రభావంపై అవగాహన పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమయంలో ఎక్కువ జననాలకు కారణమయ్యే వైద్య పరిస్థితుల గురించి తెలుసుకోవడం అవసరం. అందుకే boldsky.com రిపోర్ట్ ప్రకారం హైపర్‌ఓవిలేషన్ అంటే ఏంటి? వాసిలీవా ఎవరు? స్త్రీలు జీవితకాలంలో ఎంతమంది పిల్లల్ని కనగలరు? తెలుసుకుందాం.

### స్త్రీ తన జీవితకాలంలో ఎంతమంది పిల్లలకు జన్మనివ్వగలదు?

పిల్లలను ఉత్పత్తి చేసే స్త్రీ సామర్థ్యం ఆమె పుట్టినప్పుడు కలిగి ఉన్న అండాశయ ఫోలికల్స్ సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. స్త్రీలు సుమారు ఒకటి నుంచి రెండు మిలియన్ల అండాలతో పుడతారు. అయితే ఈ సంఖ్య కాలక్రమేణా తగ్గుతుంది. యుక్తవయస్సు నాటికి, దాదాపు 300,000 నుంచి 400,000 అండాలు మిగిలి ఉంటాయి.

ఆమె పునరుత్పత్తి సంవత్సరాల్లో, ఒక స్త్రీ సుమారు 400 నుంచి 500 సార్లు అండోత్సర్గం చేస్తుంది. మహిళలు సాధారణంగా యుక్తవయస్సు నుంచి మెనోపాజ్ వరకు నెలకు ఒకసారి అండోత్సర్గం చేస్తారు. ఇది 30 నుంచి 40 సంవత్సరాల సంతానోత్పత్తికి దారితీస్తుంది. ఈ విధంగా, థియోరెటికల్‌గా, ఒక స్త్రీ ప్రతి సైకిల్లో గర్భం దాలిస్తే, ఆమె దాదాపు 40 సార్లు గర్భం దాల్చవచ్చు. అయినప్పటికీ, ఆరోగ్యం, మెడికల్ కేర్, వ్యక్తిగత అంశాలు వాస్తవానికి ఈ సంఖ్యను బాగా తగ్గిస్తాయి.

### 69 మంది పిల్లలను కన్న మహిళ


ఒక తల్లికి పుట్టిన పిల్లల సంఖ్య అత్యధికంగా 69 అని రికార్డులు సూచిస్తున్నాయి. రష్యాలోని షుయాకు చెందిన రైతు ఫియోడర్ వాసిలీవ్ భార్య వాసిలీవా 27 సార్లు గర్భం దాల్చింది. ఆమెకు 16 కాన్పుల్లో కవలలు, ఏడు సార్లు ముగ్గురు పిల్లలు, నాలుగు కాన్పుల్లో ఒకే సారి 4 పిల్లల చొప్పన పుట్టారు. వినడానికి ఆశ్చర్యంగా ఉన్నా, కొన్ని నివేదికలు ఇది వాస్తమేనని చెబుతున్నాయి. 1782లో నికోల్స్క మొనాస్టరీ నుంచి వచ్చిన నివేదికను గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రస్తావించింది. ఇందులో ప్రతి జననాన్ని రిపోర్ట్ చేశారు. 1782లో సెయింట్ పీటర్స్‌బర్గ్ నుంచి వచ్చిన ఒరిజినల్ లెటర్ ఈ అసాధారణ కథనాన్ని ధృవీకరిస్తోంది. 1878లో ఫ్రెంచ్ అకాడమీ అధ్యయనం వాసిలీవ్ సంతానోత్పత్తికి సంబంధించిన అంశాలను ప్రస్తావించింది.

### ఒక కాన్పులో ఎక్కువ మంది ఎందుకు జన్మిస్తారు?


ఇక స్త్రీ సాధారణంగా ఒక సైకిల్లో ఒక అండం విడుదల చేస్తుంది. ఒకటి కంటే ఎక్కువ అండాలను విడుదల చేసే స్థితిని హైపర్‌ఓవిలేషన్ అంటారు. ఈ అండాలు ఫలదీకరణం చెందితే, కవలలు లేదా అంతకంటే ఎక్కువ మంది జన్మించవచ్చు. వాసిలియేవ్ ఒక్కో కాన్పులో ఎక్కువ మంది పిల్లలను కనడానికి జన్యు పరంగా వచ్చిన హైపర్‌ఓవిలేషన్ కారణంగా కావచ్చు.

ముందడుగు
ఆదివారం, 28-7-2024, హైదరాబాద్

# యానిమల్ వివాదంపై తొలిసారి స్పందించిన రణ్‌బీర్ కపూర్



బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, అర్జున్ రెడ్డి ఫేమ్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో వచ్చిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'యానిమల్' (Animal). గతేడాది డిసెంబర్ 01న ప్రేక్షకులు ముందుకు వచ్చిన ఈ చిత్రం విడుదలైన రోజు నుంచే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపించడమే కాకుండా రూ.900 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. అయితే ఈ సినిమాపై సినీ, రాజకీయ ప్రముఖులు విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. ముఖ్యంగా బాలీవుడ్ దిగ్గజ లిరిక్ రైటర్ జావేద్ అక్తర్ ఇలాంటి చిత్రాలు ప్రేక్షకులకు ఏం సందేశాలు ఇస్తున్నాయని చేసిన వ్యాఖ్యలు అప్పట్లో సంచలనం రేపాయి. ఇక దీనికి కౌంటర్‌గా 'యానిమల్' దర్శకుడు సందీప్ వంగా కూడా ఘాటుగా రిప్లయ్ ఇచ్చాడు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది. అయితే ఈ యానిమల్ సినిమాపై వచ్చిన వివాదలపై తాజాగా స్పందించాడు నటుడు రణ్‌బీర్ కపూర్. నేను మొదట ఈ కథ విన్నప్పుడు చాలా భయపడ్డాను. అయితే తాను గుడ్ బాయ్ అనే ఇమేజ్ నుంచి దూరంగా వెళ్లాలి అనుకున్నాను. ఈ క్రమంలోనే యానిమల్ చేశాను. ఈ సినిమా విడుదల అయ్యాక చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. మూవీ చూసిన కొందరు బాగుందని అని చెప్పగా నా కుటుంబ సభ్యులు మరికొంతమంది ఇలాంటి సినిమా ఎలా చేశావని తిట్టారు. ప్రేక్షకుల కోసమే ఈ సినిమా చేసిన.. అది తప్ప దారిలో ప్రేక్షకుల దగ్గరికి వెళ్లింది. ముఖ్యంగా సోషల్ మీడియాలో ఈ సినిమాపై నెగిటివ్ ప్రచారం చేయడం. ఇదోక స్త్రీ ద్వేషపూరిత చిత్రమని చెప్పడం మాకు నెగిటివ్ అయ్యింది. సందీప్ వంగా తీసిన కబీర్ సింగ్(అర్జున్ రెడ్డి) కూడా ఇంతకుముందు ఇలాంటి వివాదాలనే ఎదుర్కోంది. అందుకే అవి పట్టించుకోలేదు. యానిమల్ సినిమా నచ్చని వారిలో ఇండస్ట్రీ వాళ్లు ఉన్నారు. వాళ్లకి ఒక్కటే చెప్పాను. క్షమించండి మరోసారి ఇలాంటి సినిమా చేయను అంటూ రణ్‌బీర్ కపూర్ వెల్లడించాడు.



# సప్త సాగరాలు బ్యూటీతో రొమాన్స్ చేయనున్న విజయ్ దేవరకొండ.?

టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ ప్రస్తుతం ఒక సాలిడ్ హిట్ కోసం వెయిట్ చేస్తున్న విషయం తెలిసిందే. లైగర్ వంటి భారీ డిజాస్టార్ తర్వాత ఖుషి, ఫ్యామిలీ స్టార్ అంటూ ప్రేక్షకుల ముందుకు రాగా ఈ సినిమాలు కూడా బాక్సాఫీస్ ముందు ఫ్లాప్‌గా నిలిచాయి. ఇక ప్రస్తుతం విజయ్ గౌతమ్ తిన్ననూరితో ఒక సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా ప్రస్తుతం శ్రీలంకలో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది. అయితే ఈ సినిమా షూటింగ్‌లో ఉండగానే మరో ప్రాజెక్ట్‌ను విజయ్ పట్టాలెక్కించబోతున్నాడు. 'రాజా వారు రాణి గారు' ఫేమ్ రవికిరణ్ కోలాతో విజయ్ ఒక సినిమా చేయనున్న విషయం తెలిసిందే. ఉత్తరాంధ్ర బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే ఈ సినిమాలో హీరోయిన్ రోల్‌కు సంబంధించి ఒక క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమాలో కథానాయికగా సప్త సాగరాలు బ్యూటీ రుక్మిణి వసంత్‌ను ఎంపిక చేసినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మొదట ఈ సినిమాలో హీరోయిన్‌గా సాయి పల్లవిని అనుకున్నారు మేకర్స్. కానీ అనుకోకుండా ఆ ప్లేస్ లో ఇప్పుడు రుక్మిణి వచ్చింది. అయితే ఈ విషయంపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు.